సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 25 । నవంబర్ । 2022



గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు IIలో



అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

- తడిచిన వరి పనలు IIలో



రోజూ ఐదువేల మందికి ఉపాధి పనులు

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ IIలో

న్యూస్‌రీల్

చింతూరు తహసీల్దార్ సస్పెన్షన్

సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఉత్తర్వులు

చింతూరు: ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోలేదన్న కారణంతో తహసీల్దార్ సాయికృష్ణను వారం రోజుల పాటు సస్పెండ్ చేస్తూ చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడి రెవెన్యూ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసిన నాగూర్ మీరాను విధుల్లో నిర్లక్ష్యం చేసినందుకు గాను కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేశారు. ఇలా చర్యలు తీసుకున్నా తిరిగి అతనిని విధుల్లో కొనసాగిస్తున్న తహసీల్దార్ వ్యవహార శైలిపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీంతో తమ ఆదేశాలను బేఖాతరు చేసిన తహసీల్దార్ సాయికృష్ణను వారంపాటు సస్పెండ్ చేస్తూ సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కారం సుబ్బారావుకు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

అడ్డతీగల సీఐ రాంబాబు

అడ్డతీగల: కేంద్ర రక్షణ విభాగంలో భర్తీ చేస్తున్న పోలీసు ఉద్యోగాలకు గిరిజన యువత దరఖాస్తు చేసుకోవాలని అడ్డతీగల సీఐ వై.రాంబాబు కోరారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఏఆర్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ విభాగాల్లో పోలీసు కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ వెలువడిందన్నారు. అర్హులైన గిరిజన యువతీ యువకులు వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. టెన్త్ పాసై పురుషులు 162.5 సెంటీమీటర్లు, స్త్రీలు అయితే 150 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలన్నారు. వయసు 18 నుంచి 28 ఏళ్ల లోపు కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు తేదీ నవంబర్ 30 వరకూ ఉందన్నారు. ఆసక్తి కలిగి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోలీసుశాఖ స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఐటీడీఏతో కలిసి సంయుక్తంగా ఉచిత వసతి, భోజనం, శిక్షణ కల్పిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఏవోబీలో విస్తృత కూంబింగ్



వై.రామవరం మండల అటవీ ప్రాంతంలోకి ప్రవేశిస్తున్న పోలీసు బలగాలు

వై.రామవరం: మండల సరిహద్దు ప్రాంతమైన ఏవోబీ అటవీ ప్రాంతంలో వారం రోజులుగా పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారం మేరకు వారు అప్రమత్తమయ్యారు. మండల సరిహద్దు అటవీ ప్రాంతంలో తనిఖీలు ముమ్మరం చేశాయి. అపరిచితులు, అనుమానాస్పదన వ్యక్తులపై నిఘా ఉంచాయి.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన దిగుబడి

బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ



మాట్లాడుతున్న బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ

గూడెంకొత్తవీధి: ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం ద్వారా భూసారం మెరుగుపడటమే కాకుండా ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ అన్నారు. మండలంలోని మంగళపాలెంలో గురువారం ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానాలు, కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. సేద్యవిభాగం శాస్త్రవేత్త ప్రసాదరావు, చింతపల్లి శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్, గిరిజన వికాస్ సంస్థ ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ పురుషోత్తం నాయుడు, అభ్యుదయ రైతులు పోతురాజు, రామకృష్ణ, నడిపిపడాల్ పాల్గొన్నారు.

గిరి సిగలో హరిత వికాసం

మన్యం..ప్రకృతి అందాలకు నిలయం.. చుట్టూ పచ్చని కొండలు.. ఆకట్టుకునే రమణీయ దృశ్యాలు.. వీటిని పరిరక్షించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. తూర్పు కనుమల్లో అడవులను సంరక్షిస్తూనే.. గిరిజనులకు ఆర్థిక దన్నుగా ఉండేందుకు సరికొత్త ఆలోచనలతో ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మాణానికి కసరత్తు మొదలు పెట్టింది. ఇందుకు అవసరమైన సహకారం అందించేందుకు సింహాద్రి ఎన్టీపీసీ ముందుకు వచ్చింది.



ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మించే ప్రాంతానికి వెళ్లే దారి

- మర్రగుడ అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం ప్రాజెక్టు
- ఓవైపు ప్రకృతి అందాలు, అడవుల సంరక్షణ
- మరోవైపు గిరి యువతకు ఉపాధి
- సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో అటవీశాఖ అడుగులు

అనంతగిరి: ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడపాలని చాలామందికి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ సంకల్పించింది. అటవీ ప్రాంతంలోని ప్రకృతి అందాల నడుమ బసచేసేలా ఎకో టూరిజం ప్రాజెక్టుకు నిర్మాణానికి సన్నాహాలు మొదలుపెట్టింది. ఇందుకు అవసరమైన రూ.5.5 కోట్లను సామాజిక బాధ్యతగా సమకూర్చేందుకు ఎన్టీపీసీ సింహాద్రి ముందుకు వచ్చింది. ఈ నిధులతో మండలంలోని మర్రగుడ సమీపంలోని చాపరాయిని ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో ఎకో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని అటవీశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు.

స్థానికుల ఉపాధి లక్ష్యంగా..

- మర్రగుడ (వన సంరక్షణ సమితి) వీఎస్ఎస్‌లో సుమారు 80 మంది గిరిజనులు సభ్యులు ఉన్నారు. ఈ సంస్థను ఎకో టూరిజం ప్రాజెక్టుకు అనుసంధానం చేస్తూ ప్రాజెక్టు నిర్మాణానికి నిర్ణయించారు. పూర్తయితే స్థానికంగా గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా నూతన అనుభూతి పొందేలా పర్యాటకులకు వేదిక కానుంది.

ప్రాజెక్టు విశేషాలు...

- ఈ సెంటర్‌లో ఎకో టూరిజం కాటేజీలు, ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్, నాన్-టింబర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ (ఎన్‌టీఎఫ్‌పీ) ప్రాసెసింగ్ సెంటర్ నిర్మాణం.
- ఓపెన్ బటర్‌ఫ్లై గార్డెన్, ఆర్కిడేరియం, ఔషధ మొక్కల వనం, వాచ్ టవర్ ఏర్పాటు
- తూర్పు కనుమల్లోని జీవవైవిధ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టడీ సెంటర్.
- ప్రజలకు సేంద్రీయ, స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులను అందించేలా చిన్న చిన్న వ్యాపార సముదాయాల ఏర్పాటు. వీటిలో పనస, చింతపండు, ఔషధ మొక్కలు, ఏజెన్సీలో దొరికే అరుదైన పండ్లు, మొక్కలు విక్రయించే స్టాళ్లు.
- మంచి ఫలితాలు సాధన దిశగా గిరిజనుల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ.



ప్రాజెక్టు నిర్మించే ప్రాంతానికి ఆనుకుని ఉన్న చాపరాయి

ఉపాధి, అడవుల సంరక్షణ

ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు మర్రగుడ సమీపంలోని అటవీ ప్రాంతాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు. మూడు దఫాలుగా ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో స్థానికంగా ఉంటున్న గిరిజనులకు ఉపాధితో పాటుగా అడవులు సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం.

– దుర్గాప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, అనంతగిరి

క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరి

అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు : జిల్లాలోని అన్ని శాఖల అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించాలని ఒక ప్రకటనలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. నూతనంగా అవతరించిన అల్లూరి సీతారామరాజు జిల్లా భారీగా విస్తరించి ఉన్నందున అదేస్థాయిలో అధికారులు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సేవలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని మండలాల్లో అధికారులు, ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. జిల్లా స్థాయి అధికారులు చింతూరులో ఒకరోజు, రంపచోడవరం డివిజన్‌లో రెండు రోజులు పర్యటించాలని ఆయన ఆదేశించారు. పర్యటన వివరాలను తనకు తప్పనిసరిగా అందజేయాలని కలెక్టర్ సూచించారు.

పారిశుధ్యం నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే..

జిల్లాలోని అన్ని పంచాయతీల్లోను పారిశుధ్యం నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుకు ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. గ్రామ వలంటీర్లను కూడా పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పర్యాటక ప్రాంతాలతో పాటు జిల్లా వ్యాప్తంగా పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలానికి రెండు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని చెత్త చెదారాలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి 15 రోజులకోసారి పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

లంబసింగిలో పోలీసు చెక్‌పోస్టు

చింతపల్లి రూరల్: పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశామని పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ అన్నారు. గురువారం లంబసింగి ప్రాంతంలో పర్యటించిన ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో చెక్‌పోస్ట్ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన భూ రికార్డులను పరిశీలించారు. లంబసింగిలో చెక్‌పోస్ట్ ఏర్పాటుకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో భూ కేటాయింపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్ని గ్రామాలకు సెల్‌ఫోన్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా మరిన్ని టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మండలంలో 50 బీఎస్ఎన్ఎల్, 9 జియో, 4 ఎయిర్‌టెల్ సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

సాక్షి, పాడేరు: క్షయ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని హుకుంపేట, పాడేరు రెండు మండలాలకు చెందిన 20 మంది క్షయవ్యాధిగ్రస్తులకు ధరణి, సీఎమ్‌డీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీటీసీవో విశ్వేశ్వరనాయుడు, ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్, డీఎల్వో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న పీవో

మాతాశిశు ఆరోగ్య సేవలు మరింత విస్తృతం

డీఎంహెచ్‌వో జమీల్‌బాషా

సాక్షి,పాడేరు : జిల్లా ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమీల్ బాషా ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఇక్కడ వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య బృందాలతో సమీక్షించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. రక్త పరీక్షలు, ఇతర వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావుతో సమీక్షించారు. జిల్లా ఆస్పత్రి కావడంతో అన్ని పీహెచ్‌సీల నుంచి వచ్చే రిఫరల్ కేసులకు సత్వర వైద్య సేవలు కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ కంట్రోల్ అధికారి కె.సుబ్రమణ్యం రెడ్డి, ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా కోఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, డీఐవో డాక్టర్ ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో జమీల్ బాషా

విద్యుదాఘాతంతో గిరి యువకుడి మృతి

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీ మత్స్యపురంలో కోడా జగన్(23) అనే గిరి యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామంలోని పాఠశాల వద్ద నాడు- నేడు పనుల్లో భాగంగా పాఠశాల పైకప్పు పనులు చేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్పృహకోల్పోయిన అతనిని వెంటనే పాఠశాల ఉపాధ్యాయుడు, కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి ప్రైవేట్ వాహనంలో తీసుకువచ్చారు. వైద్యసేవలు అందించేలోపే మృతి చెందాడు. యువకుడు మృతితో కుటుంబం పెద్దదిక్కు కోల్పోయింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు అభినందన



రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన శ్వేత, రాజేశ్వరి



విద్యార్థులను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థులను చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఐటీడీఏ కార్యాలయంలో గురువారం అభినందించారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల్లో అండర్-17 విభాగంలో గురుకుల పాఠశాలకు చెందిన సంతోష్ లాంగ్‌జంప్, సాయికుమార్ ఖోఖో, అండర్-14 విభాగం ఖోఖోలో రమేష్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, పీఈటీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని సబ్‌కలెక్టర్ కోరారు.

క్రీడా పోటీల్లో వేములోవ బాలికల ప్రతిభ

గంగవరం : మండలంలోని వేములోవ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన పాతర శ్వేత, కుంజం రాజేశ్వరి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలో పాతర శ్వేత తృతీయ స్థానం, షాట్‌పుట్‌లో కుంజం రాజేశ్వరి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం గీతాంజలి తెలిపారు. వీరితోపాటు పీడీ బాలరాజును పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

'ఈ క్రాప్' రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు

వ్యవసాయశాఖ అడ్డతీగల ఏడీఏ సావిత్రి

అడ్డతీగల: ఈక్రాప్ నమోదు చేసుకొని రసీదులు పొందిన రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని వ్యవసాయశాఖ అడ్డతీగల ఏడీఏ కె.సావిత్రి అన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద అనిగేరు, డొక్కపాలెం గ్రామాలకు చెందిన రైతులకు ఈ క్రాప్ రసీదులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరి నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

సాధారణ రకం ధాన్యం 75 కిలోలు రూ.1,530 కాగా క్వింటాల్‌కు రూ.2,040 ధరకు కొనుగోలు చేస్తామన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం 75 కిలోలు రూ.1,545 కాగా క్వింటాల్‌కు రూ.2,060 మద్దతు ధర పొందవచ్చన్నారు. రైతులు ఈ క్రాప్ రసీదులను తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. మండల వ్యవసాయాధికారి సువర్ణ కుమారి, సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



గిరి రైతులకు ఈక్రాప్ రసీదులు అందజేస్తున్న ఏడీఏ సావిత్రి తదితరులు

కాఫీ రైతులకు ధరలు తెలియజేయండి

జిల్లా వ్యవసాయ మండలి చైర్‌పర్సన్ సరస్వతి సూచన


జి.మాడుగుల: కాఫీ రైతులకు ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలను లైజన్‌వర్కర్లు, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు తెలియజేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ మినుముల సరస్వతి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లైజన్‌వర్కర్లు, వ్యవసాయ ఉద్యానవన సహాయకులు, కాఫీ రైతులకు గిట్టుబాటు ధర తదితర అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కాఫీ రైతులకు మార్కెట్ ధరలు ఎప్పటికప్పుడు తెలియజేయడం వల్ల గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు మాట్లాడుతూ కాఫీ పండ్లు కిలో రూ.60. పార్చ్‌మెంట్ కిలో రూ.330, డ్రైచెర్రీ రూ.కిలో రూ.270 మార్కెట్ ధర ఉందని తెలిపారు. ఈ ధరలను వ్యాపారులు పాటించి కాఫీ కొనుగోళ్లు చేపట్టాలిన ఆయన సూచించారు. మార్కెటింగ్ ఏడీ రాకేష్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కల్తీ చేయకుండా మంచి ఉత్పత్తులను అమ్మితే గిట్టుబాటు ధర వస్తుందని అన్నారు. కాఫీ రైతులు, వ్యాపారులు ప్రస్తుత మార్కెట్ ధర, లావాదేవీలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి కె. బాలకర్ణ, మండల వ్యవసాయాధికారి ఎల్ఆర్‌బీ పాత్రుడు, కాఫీ హెచ్‌వో అప్పలనాయుడు, లైజన్ వర్కర్లు, వ్యవసాయ ఉద్యానవన సహాయకులు, వర్తకులు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి

12 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం

ఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈ సురేష్‌బాబు



కొత్తవీధి గిరిజనులతో మాట్లాడుతున్న ఈఈ సురేష్‌బాబు

కొయ్యూరు: మండలంలోని 12 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తునామని నర్సీపట్నం ఈపీడీసీఎల్ డీఈ సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మండలంలో బూదరాళ్ల పంచాయతీలో పర్యటించారు. బి.కొత్తవీధి గ్రామాన్ని సందర్శించారు. ఈ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో స్థానిక గిరిజనులు స్పందనలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు డీఈ గ్రామాన్ని సందర్శించారు. త్వరలో గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. విద్యుత్ లేని 12 గ్రామాలను గుర్తించామన్నారు. ఎంత కష్టమైనా ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసి తీరుతామని ఆయన చెప్పారు.విద్యుత్ సరఫరాకు సంబంధించి అంచనాలు రూపొందిస్తున్నామని, వీటికి అనుమతి రాగానే పనులు చేపడతామని చెప్పారు. ఏడీఈ అప్పారావు, ఏఈ శ్రీనివాస్, సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన భూముల సర్వే

రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

అడ్డతీగల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాల భూములను పూర్తిస్థాయిలో సర్వేచేసి యాజమాన్యాలకు అప్పగించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. గురువారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి కళాశాలతో పాటు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ గోవిందరాజులు నుంచి వాటికి సంబంధించిన భూముల వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల ప్రకారం సర్వే చేసి ఆయా యాజమాన్యాలకు అప్పగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. భవనాలతో పాటు ఖాళీ స్థలాలను పరిశీలించారు. నాడు- నేడు పనుల వివరాలను ఏఈ నాగరాజు నుంచి తెలుసుకున్నారు.



పాఠశాల భూముల వివరాలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

ఫొటో @ రూ.20



- పర్యాటకులకు అనువుగా వలిసె, పొద్దుతిరుగుడు పెంపకం
- క్యూకట్టిన సందర్శకులు
- రోజుకు రూ.1500 వరకు ఆదాయం



కురిడి పంచాయతీ జంగిడివలస గ్రామానికి చెందిన గిరి రైతు పాక్కొడి సన్యాసిరావు కొత్తగా ఆలోచించాడు. అందుబాటులో ఉన్న అవకాశాలను ఆదాయ వనరుగా మార్చుకున్నాడు. పర్యాటక సీజన్‌లో ఇక్కడికి వచ్చే సందర్శకులను ఆకట్టుకునేలా అరకు-పాడేరు మార్గంలో పది సెంట్లలో వలిసె, 50 సెంట్లలో పొద్దు తిరుగుడు తోటలను రూ.3 వేల పెట్టుబడితో ఆకర్షణీయంగా పెంచాడు. ఏపుగా ఎదిగి పసుపు పచ్చని తివాచీ పరిచినట్టుగా ఆకట్టుకోవడంతో ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఒకొక్కరి నుంచి రూ.20 చొప్పున తీసుకుంటూ రోజుకు సుమారు రూ.1500 వరకు ఆదాయం పొందుతున్నాడు. పూల అందాలు ఎలా లేదన్నా మూడు వారాలు ఉంటున్నందున సుమారు రూ.20 వేల వరకు ఆదాయం పొందవచ్చని రైతు సన్యాసిరావు తెలిపాడు.దీంతో పాటు పంటపై కూడా ఎంతోకొంత ఆదాయం వస్తుందని ఆనందం వ్యక్తం చేశాడు.

– దుంబ్రిగుడ

కాఫీ పల్పింగ్‌కు ధర నిర్ణయం

- కిలోకు రూ.2లు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు: కాఫీ పండ్ల పల్పింగ్ కిలోకు రూ.2 ధర నిర్ణయించినట్టు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్జీవోలు, సహకార సంఘాలు, కాఫీ రైతుల కోరిన విధంగా అధ్యయనానికి ఏర్పాటుచేసిన కమిటీ కాఫీ పల్పింగ్ ధర నిర్ణయించిందని తెలిపారు. చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌లో ప్రక్రియ జరుగుతోందన్నారు. జి.మాడుగుల, జీకేవీధి పల్పింగ్ యూనిట్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. పల్పింగ్ చేయ దలచుకున్న ఎన్జీవోలు, సహకార సంస్థలు కాఫీ పండ్ల రవాణాకు సొంత సదుపాయం సమకూర్చుకోవాలని సూచించారు. లోడింగ్, అన్‌లోడింగ్ వారు చేసుకోవాల్సి ఉంటుందని పీవో తెలిపారు. కిలోకు రూ.2 చొప్పున చింతపల్లి యూనియన్ బ్యాంక్‌లోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బ్యాంక్ ఖాతా నంబరు.329102010655803లో నగదు జమచేసి పల్పింగ్ చేసుకోవాలని సూచించారు.

సేవా భావంతో రెడ్‌క్రాస్ సేవలు విస్తరణ..

సేవా భావంతో ఇండియన్ రెడ్ క్రాస్ సేవలు జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని రెడ్ క్రాస్ చైర్మన్ ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అన్నారు. ఐటీడీఏలో నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా విభాగం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెలలో రాష్ట్ర గవర్నర్ జిల్లాలో పర్యటించే అవకాశం ఉందన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో జరిగే మెగా వైద్యశిబిరంలో పాల్గొనే అవకాశం ఉన్నందున ఐటీడీఏ నుంచి రెడ్ క్రాస్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సేకరించే రక్తం నిల్వలు, పంపిణీ చేసిన రక్తం వివరాలను సక్రమంగా రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, సెక్రటరీ ఈశ్వరరావు, లైఫ్ మెంబర్లు లీలాప్రసాద్, లోహితాస్, సూర్యారావు, సుబ్రమణ్యం, గౌరీశంకర్, జయమ్మ, కన్యాకుమారి, స్వాతి, సమన్వయ కర్త కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన యువత స్వయం ఉపాధికి కృషి

స్వయం ఉపాధి మార్గాల్లో పుట్టగొడుగుల పెంపకం ఒకటి. ఇంటి వద్దే తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం పొందవచ్చు. ఈ నేపథ్యంలో గిరిజన యువతకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వీటి పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు.

- కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ
- ఇప్పటి వరకు ఆరు బ్యాచ్‌లకు పూర్తి



పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పొందుతున్న యువత

రంపచోడవరం: గిరిజన యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తోంది.గిరిజన ఉప ప్రణాళిక నిధులతో యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇస్తోంది. తేనెటీగలు, కోళ్లు, చేపల పెంపకంతో పాటు పుట్టగొడుగులు పెంపకంపై ఇప్పటి వరకు కేవీకేలో ఆరు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. తక్కువ స్థలంలో పుట్టగొడుగుల పెంపకానికి అవకాశం ఉంది. ఇంటి వద్ద పెంపకానికి మిల్కీ, ఆయిస్టర్ పుట్టగొడుగులు అనువైన రకాలు. పుట్టగొడుగులు పెంపకానికి వరిగడ్డి, మొక్కజొన్న కండెలు ఉంటే సరిపోతుంది. వీటిని అవసరమైన మేరకు సేకరించి నీడలో ఉంచుకోవాలి. ఎటువంటి సూక్ష్మజీవులు లేకుండా కార్బండిజిమ్ ద్రావణంలో నానబెట్టాలి. మరుసటి రోజు మొత్తం నీటిని తీసేసి తేమ లేకుండా మూడు గంటల పాటు ఆరబెట్టాలి. పాలిథిన్ బ్యాగుల్లో పొరలు, పొరలుగా గడ్డి, పుట్టగొడుగులు పెంపకం కోసం స్పాన్‌ను వేసి రబ్బరు బ్యాండ్‌తో బ్యాగ్ మూతి భాగాన్ని కట్టి, బ్యాగుకు 20 వరకు రంధ్రాలు చేసి చీకటి గదిలో 15 రోజులు ఉంచాలి. గదిలో ఉష్ణోగ్రత 27 నుంచి 35 డిగ్రీల వరకు, తేమ 80శాతం ఉండే విధంగా చూసుకోవాలి. 15 రోజుల తరువాత మైసీలియం బ్యాగు మొత్తాన్ని ఆక్రమిస్తుంది. ఈ బ్యాగులను వెలుతురు గదిలోకి తరలించి అడ్డంగా కత్తితో రెండు భాగాలు చేసి మట్టితో కప్పి మరొక 15 రోజులు పాటు ఉంచితే పుట్టగొడుగులు పెరుగుతాయి.

తక్కువ ఖర్చుతో..

తక్కువ ఖర్చుతో పుట్టగొడుగులు పెంపకాన్ని చేపట్టవచ్చు. కిలో పుట్టగొడుగుల పెంపకానికి రూ.40 ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో పుట్టగొడుగులకు మంచి గిరాకీ ఉంది. కిలో రూ. 200 నుంచి రూ. 250 ధర లభిస్తోంది. నెలకు సుమారు 100 కిలోల పుట్టగొడుగులను ఉత్పత్తి చేస్తే కనీసం రూ.20 వేల వరకు ఆదాయం వస్తుంది. క్రమక్రమంగా పుట్టగొడుగులు పెంపకానికి షెడ్లు సంఖ్యను పెంచుతూ ఉండాలి.

అందుబాటులో స్పాన్



పుట్టగొడుగులు పెంపకానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం పందిరిమామిడి కేవీకేలో స్పాన్ అందుబాటులో ఉంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేవీకే ద్వారా సర్టిఫికెట్లు కూడా అందజేస్తున్నాం.

– డాక్టర్ ఎస్ చిరంజీవి, శాస్త్రవేత్త, పందిరిమామిడి కేవీకే

ఐదు రోజులు శిక్షణ ఇచ్చారు



కేవీకేలో ఐదు రోజుల పాటు పుట్టగొడుగులు పెంపకం, విలువ ఆధారిత పదార్థాల తయారీపై శిక్షణ ఇచ్చారు. పెంపకానికి సంబంధించిన పుస్తకాలు ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు మేము. కొత్త వరి గడ్డి సేకరించి ప్రకృతి సంస్థ సహకారంతో పుట్టగొడుగులు పెంపకాన్ని చేపడతాం.

– వెంకటలక్ష్మి, గుబ్బలంపాడు

రాజవొమ్మంగిలో భారీ వర్షం



రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వరి కోతలు జరుగుతున్న సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతలు జరిగిన చోట వరి పనలు తడిసిపోవడంతో ధాన్యం రంగు మారి, నాణ్యత తగ్గిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఆటో టైర్ ఊడిపోయిన ఘటనలో ప్రమాదం నుంచి బయటపడిన విద్యార్థులు

- పాఠశాలకు వెళ్తుండగా ఊడిన ఆటో చక్రం
- విద్యార్థులు క్షేమం

హుకుంపేట : విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్తున్న ఆటో ప్రమాదవశత్తూ చక్రం ఊడిపోయిన ఘటనలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో గల బీవీకే ప్రైవేట్ పాఠశాలకు మండల కేంద్రానికి చెందిన 9మంది విద్యార్థులను ఆటోపై తీసుకు వెళ్తుండగా వెనక చక్రం ఒక్కసారిగా ఊడిపోయింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి ఆటో బోల్తా కొట్టకుండా అదుపు చేశారు. ఈ ఘటనలో విద్యార్థులు క్షేమంగా బయటపడడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్టు

మునగపాక : మండలంలోని మల్లవరం, గొల్లలపాలెం గ్రామాల్లో అనధికారికంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చల్లా భీమరాజు తెలిపారు. ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై ఫిర్యాదులు అందడంతో దాడి జరిపి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ లాంఛనాలతో హెచ్‌సీ అప్పారావు అంత్యక్రియలు

- అంతిమయాత్రలో డీఎస్పీ, సీఐలు

అనకాపల్లి టౌన్ : స్థానిక హిందూ శ్మశానవాటికలో పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ ఎర్రంశెట్టి అప్పారావు అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాల మధ్య జరిగాయి. మంగళవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బందోబస్తుకి అప్పారావు వెళ్లిన విషయం విదితమే. ఒక కల్యాణమండపంలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అప్పారావు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. అప్పారావు పార్థివదేహాన్ని అనకాపల్లి సాయినగర్‌కు తరలించారు. రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో గాలిలోకి మూడురౌండ్ల కాల్పులు జరిపారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.సునీల్, సీఐలు డి.మోహన్, కె.శ్రీను పాల్గొన్నారు.

సారాబట్టీలపై దాడి... ఇద్దరి అరెస్టు



ఉప్పలో నాటు సారా ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

హుకుంపేట : ఉప్ప గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం పులుపు, విక్రయానికి సిద్ధంగా ఉన్న సారాను ధ్వంసం చేశామని ఎక్సైజ్ డీఎస్పీ డి.వి.జి. రాజు తెలిపారు. మండలంలోని మత్స్యపురం పంచాయతీ ఉప్ప గ్రామంలో గురువారం ఆకస్మికంగా దాడులు చేసి సారా విక్రయిస్తున్న వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో దాడులు జరిపి 300 లీటర్ల సారా, పులుపు ధ్వంసం చేశామన్నారు. గ్రామంలో సారా విక్రయాలు నిర్వహిస్తున్న వెంకటేష్, జయప్రదలను అరెస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ సీఐ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూర్మారావు, సీఐ సంతోష్, ఎస్‌ఐ వీర్రాజు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రోజూ ఐదువేల మందికి ఉపాధి పనులు

పాడేరు: పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్పందన సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రతీ రోజు ఐదు వేల మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలని లేబర్ మొబలైజేషన్‌పై ఎంపీడీవోలు,ఏపీవోలు శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న నిర్మాణ పనులకు బిల్లుల చెల్లింపులు ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు,మన బడి నాడు-నేడు పనులు సకాలంలో సమయానికి పూర్తి చేయాలని సూచించారు.గడప గడపకు మన ప్రభుత్వంలో 193 పనులు మంజూరు చేశామన్నారు. సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. క్లాప్ మిత్రాల జీతాలు చెల్లింపులకు ఎంపీడీవోలు చొరవ చూపి త్వరితగతిన చెల్లించాలన్నారు.గృహ నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు.లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు. ఈ సమావేశం గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు, డీఈవో డాక్టర్ పి.రమేష్, గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్,పంచాయతీరాజ్ ఈఈ కొండయ్య పడాల్,హౌసింగ్ పీడీ బీహెచ్.శ్రీనివాస్, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని,ఎంఈవో సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

చింతపల్లి: గిరిజన యువతీ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఏఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి అర్హతతో బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఏఆర్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీలలో కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో యువతీ యువకులకు వలంటీర్లు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సమీప పోలీస్‌స్టేషన్ల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఉచిత శిక్షణ,భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని ఏఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ షరీఫ్ ఆలీ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రంపచోడవరం గురుకుల కళాశాలలో వంటకాలను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. మండలంలో పలు పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పెదగెద్దాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధన విధానాన్ని పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులున్నారు తదితర విషయాలను తెలుసుకున్నారు. అనంతరం రంపచోడవరంలోని గురుకుల బాలుర జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. స్టోర్‌ను రూమ్ పరిశీలించి, నిల్వ ఉన్న సరుకులు వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆస్పత్రికి ఆస్పత్రికి తీసుకువెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, ఎంఈవో కేవీవీ సత్యనారాయణదొర, సర్పంచ్ వడగల ప్రసాద్, ఉపాధ్యాయులు సూరిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు పక్కాగా అమలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ అధికారి రాంగోపాల్

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని గిరిజన సంక్షేమశాఖ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ అధికారి రాంగోపాల్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, కార్యదర్శులు, వీఆర్వోలు, వీఏవోలు, ఉపాధి పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా, అమ్మఒడి, ఆర్వోఎఫ్ఆర్, ఎన్ఆర్‌జీఎస్ వంటి పథకాలను నేరుగా సంబంధిత లబ్ధిదారులకు డీబీటీ పద్ధతిలో చేరాలన్నారు. ఇందుకోసం అందరికీ ఆధార్ అప్‌డేట్ చేయించాలని తెలిపారు. దీనిపై అన్నిశాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమ సహాయ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ అధికారి మల్లికార్జున్, తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఏవో మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న జిల్లా పౌరసరఫరా అధికారి శివప్రసాద్

సాక్షి, పాడేరు : ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన 340 కిలోల బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని ఆటోను సీజ్ చేసినట్టు జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్ అన్నారు. పాడేరు మండలంలోని గుత్తులపుట్టు వారపు సంతను గురువారం సందర్శించి తనిఖీ చేపట్టారు. ఆ సమయంలోని ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నామని, బియ్యం విలువ రూ.లక్ష 8వేలు ఉంటుందని, నిందితుడికి 6ఏ నోటీసులు జారీచేశామన్నారు. సంయుక్త జిల్లా కలెక్టర్ కోర్టులో వ్యక్తిని హాజరుపరుస్తామన్నారు.

28లోగా ఉచిత బియ్యం తీసుకోండి

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన (పీఎమ్‌జీకేఎవై) పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరూ వారికి సరఫరా చేస్తున్న ఉచిత బియ్యాన్ని ఈనెల 28లోగా విడిపించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి శివప్రసాద్ సూచించారు. అర్హుల జాబితాలను అన్ని సచివాలయాలతో పాటుగా రేషన్ డిపోల వద్ద ఉంచినట్టు తెలిపారు.

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో వాతావరణ మార్పులు, అకాల వర్షాలతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. శీతాకాలంలోను బుధవారం రాత్రంతా వర్షం కురిసింది. దీంతో వరికుప్పలు, వరి పనులు తడిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి వాతావరణం మబ్బుగానే ఉంది. మంచు కురవలేదు.అయితే మధ్యాహ్నం సూర్యుడు కాసేపు ప్రకాశించినా సాయంత్రం నుంచి మళ్లీ వర్షం ప్రారంభమైంది. హుకుంపేట,డుంబ్రిగుడ ప్రాంతాల్లో భారీ వర్షం పాడేరు,జి.మాడుగుల,పెదబయలు ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. అకాల వర్షాలతో అప్రమత్తమైన గిరిజన రైతులు వరికుప్పలకు రక్షణగా ప్లాస్టిక్ కవర్లు కప్పారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు : ఏజెన్సీలో వాతావరణ మార్పుల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 19.8 డిగ్రీలు, అరకులోయలో 16.4 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 16 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలిగాలులు తగ్గడంతో మన్యం వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

జీలుగు కల్లుతో బెల్లం తయారీపై అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వెంగయ్య

మోతుగూడెం: జీలుగు కల్లుతో బెల్లం, ఇతర ఉత్పత్తులు తయారు చేయవచ్చని రంపచోడవరం హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంగయ్య తెలిపారు. ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇంతులూరు వాగులో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడు గ్రామాల నుంచి 57 మంది కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త వెంగయ్య మాట్లాడుతూ జీలుగు బెల్లం ఆయుర్వేద మందుల తయారీలో వినియోగిస్తారని, మంచి మార్కెట్ ఉందని తెలిపారు. ఆశా సంస్థ కార్యదర్శి సయ్యద్ సుభానీ మాట్లాడుతూ జీలుగు కల్లును సేకరించి బెల్లం తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి జె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

కొయ్యూరు: అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేట నుంచి అల్లూరి జిల్లా కాకరపాడు మీదుగా తూర్పు గోదావరి జిల్లాకు స్కూటీపై తరలిస్తున్న పది కిలోల గంజాయిని సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితుల్లో ఒకరు మహారాష్ట్ర ముంబైకి చెందిన జోకిమ్ డిసౌజ కాగా నర్సీపట్నానికి చెందిన నక్కా శ్రీనుగా గుర్తించారు. ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు స్కూటీని తనిఖీ చేయగా గంజాయితో వారిద్దరు పట్టుబడ్డారని సీఐ తెలిపారు. నిందితులు ఇద్దరి నుంచి మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

బియ్యం లారీ బోల్తా



భీసుపురం సమీపంలో బోల్తా కొట్టిన లారీ

అనంతగిరి : మండలంలోని భీసుపురం గ్రామ సమీపంలోని మలుపు వద్ద గురువారం బియ్యం లారీ బోల్తాకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. విశాఖపట్నం ఫుడ్ కార్పొరేషన్ నుంచి 400 బియ్యం బస్తాల లోడ్‌తో లారీ అరకులోయ జీసీసీ గోడౌన్ వద్దకు వెళుతుండగా మార్గమధ్యంలో భీసుపురం గ్రామ సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. బియ్యం బస్తాలన్నీ చెల్లా చెదురుగా పడిపోయాయి. ఈ మలుపు వద్ద తరుచూ పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అధికారులు స్పందించి మలుపు వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరారు.